మంత్రి పొన్నంకు ఆహ్వానం



గన్‌ఫౌండ్రీ: మేరు యువతలోని ప్రతిభను వెలికి తీసేందుకు క్రికెట్ పోటీలు నిర్వహించడం ఎంతో అభినందనీయమని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈ నెల 11, 12 తేదీల్లో నిజాం కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న మేరు క్రికెట్ లీగ్ టోర్నమెంట్‌ను ప్రారంభించాలని కోరుతూ గురువారం మేరు సంఘం నాయకులు ఆయనకు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో మేరు సంఘం నాయకులు కీర్తి రాజగోపాల్, డి.నర్సింగ్ రావు, ఓదెల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జియాగూడ మల్లన్న ఆలయ బ్రహ్మోత్సవాలు ప్రారంభం



మల్లన్న, బ్రమరాంబిక, గొల్ల కేతమ్మ

జియాగూడ: జియాగూడ మల్లన్న ఆలయ బ్రహ్మోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ధిష్టి కుంభం, అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు, అఖండ హారతి కొనసాగాయి. అలాగే 10న భ్రమరాంబ దేవి కుంకుమార్చన, మల్లికార్జున సహస్రనామార్చన, 11న ఆంజనేయ స్వామి సిందూరం సమర్పణ, ఆకు పూజ, 12న మల్లికార్జున స్వామి బిళ్వార్చన, సత్యనారాయణ వ్రతం, 13న మన న్యాస పూర్వక రుద్రాభిషేకం, 14న గంగ తెప్ప, సాయంత్రం మల్లికార్జున కల్యాణం, 15న సదర్ పటం, అగ్నిగుండాలు తదితర కార్యక్రమాలను వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఒగ్గు పూజారి బండారి నారాయణ గారి మల్లేశం తెలిపారు.

బీజేపీ గుడిమల్కాపూర్ డివిజన్ అధ్యక్షుడిగా దేవర వంశీ



గోల్కొండ: నాంపల్లి నియోజకవర్గం బీజేపీ గుడిమల్కాపూర్ డివిజన్ అధ్యక్షుడిగా దేవర వంశీ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కార్యాలయం నుంచి గురువారం ఆయనకు నియామక ఉత్తర్వులు అందాయి. 15 ఏళ్లుగా బీజేపీ యువజన విభాగంలో వివిధ హోదాల్లో పని చేశారు. గుడిమల్కాపూర్ దివంగత కార్పొరేటర్ దేవర కరుణాకర్ కుమారుడైన దేవర వంశీ డివిజన్‌లో అందరికీ సుపరిచితుడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ పటిష్టతకు అందరి సహకారంతో ముందుకు సాగుతానన్నారు.

సత్కారం



చార్మినార్: బేలా చందులాల్‌లోని ముత్యాలమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడు పొటేల్ సదానంద్ యాదవ్ ఆధ్వర్యంలోని ప్రతినిధుల బృందం హంపీ మఠం మేనేజర్ శివశంకర్‌ను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. వైకుంఠ ఏకాదశి ఉత్సవాలను పురస్కరించుకొని తిరుమలలోని హంపీ మఠానికి వెళ్లిన బృందం అక్కడి మేనేజర్ శివశంకర్‌ను కలిసి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పొటేల్ వివేక్ యాదవ్, ప్రముఖ బిల్డర్ కోటిరెడ్డి తదితరులు ఉన్నారు.

రక్తదానం



రక్తదానం కోసం బీపీ చెకప్ చేస్తున్న దృశ్యం

అబిడ్స్: రక్తదానం చేసిన ప్రతి యూనిట్ రక్తం అవసరంలో ఉన్న రోగులకు ప్రాణాధారంగా నిలుస్తుందని ఫెర్నాండెజ్ ఫౌండేషన్ అడ్మినిస్ట్రేషన్ అండ్ ఆపరేషన్స్ అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ తేజస్విని కుష్నూర్ తెలిపారు. ఫెర్నాండెజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తలసేమియా, సికిల్ సెల్ సొసైటీ సహకారంతో రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించగా 100 మంది రక్తదాతలు ముందుకు వచ్చి రక్తదానం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ..స్వచ్ఛంద సేవకులు క్రమం తప్పకుండా రక్తదానం ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. తలసేమియా సికిల్ సెల్ సొసైటీ జాయింట్ సెక్రటరీ అలీమ్ బేగం మాట్లాడుతూ..దీర్ఘకాలిక రక్త రుగ్మతలు ఉన్నవారికి నిరంతరం రక్తమార్పిడి అవసరమన్నారు. ఇలాంటి గొప్ప కార్యక్రమానికి తమ భాగస్వామ్యం కావడం గర్వకారణంగా ఉందని తెలిపారు.

వైకుంఠ ఏకాదశికి సర్వం సిద్ధం

- ముస్తాబవుతున్న ఆలయాలు
- అన్ని ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు
- హాజరు కానున్న పలువురు అధికార, అనధికార ప్రముఖులు



ఆకట్టుకుంటున్న చార్మినార్ బాలాజీ మందిరం అలంకరణ



పుష్పాలంకరణలో ఆలయ గర్భగుడి



సంగం రామాలయంలో శక్తిపీఠాలు, ద్వాదశ జ్యోతిర్లింగాల ఏర్పాట్లు

చార్మినార్: చార్మినార్ చౌక్ మైదాన్ ఖాన్‌లోని బాలాజీ మందిరంలో శుక్రవారం నుంచి నిర్వహించనున్న వైకుంఠ ఏకాదశి మహోత్సవాలను పురస్కరించుకుని నిర్వాహకులు ఇప్పటికే తగిన ఏర్పాట్లు చేశారు. కేవలం పాతబస్తీ భక్తులే కాకుండా నగరంలోని ఇతర ప్రాంతాల నుంచి అత్యధికంగా వచ్చి వేంకటేశ్వర స్వామిని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఆలయ ప్రధాన అర్చకులు శంగారం రమణాచార్యులు, అలంకార బ్రహ్మ ఆత్రేయా చార్యులు తగిన ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల సందర్భంగా పశ్చిమ బెంగాల్, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన పలువురు కళాకారులతో వివిధ రకాల పూలతో ఆలయాన్ని అందంగా ముస్తాబు చేయించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగిన ఏర్పాట్లు చేశారు.

సంగం రామాలయం ముస్తాబు..

లంగర్‌హౌస్: ముక్కోటి ఏకాదశికి సంగం రామాలయం ముస్తాబయ్యింది. సంగం మఠ ఆలయంలో ఉత్తర ద్వార దర్శనంతో పాటు వైకుంఠ ఏకాదశి రోజున విష్ణుమూర్తి మూడు అవతారాలను ఒకే చోట దర్శించేకోవచ్చు. ఈ సంవత్సరం లక్ష్మీ అమ్మవారికి ఇష్టమయిన శుక్రవారం రోజు వైకుంఠ ఏకాదశి రావడం విశిష్టత సంతరించుకుంది. ఈ సందర్భంగా పీఠాధిపతులు రాహుల్‌దాస్ బాబా ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం నుంచే వివిధ పూజా కార్యక్రమాలు ప్రారంభం అయ్యాయి. శుక్రవారం తెల్లవారుజామున స్వామి వారికి సహస్ర శ్రీ ఫలాభిషేకం ఉంటుంది. అనంతరం సీతారాములను భారీ హనుమంత వాహనంపై లంగర్‌హౌస్ పురవీధుల్లో వైభవంగా ఊరేగించనున్నారు. సాయంత్రం 5 గంటలకు శ్రీనివాసుడుని గరుడవాహనంపై ఊరేగించనున్నారు.

జియాగూడ రంగనాథ ఆలయంలో..

జియాగూడ: జియాగూడ రంగనాథ దేవస్థానంలో శుక్రవారం వైకుంఠ ద్వార దర్శనం గరుడ వాహన సేవా, స్వామివారి పురవీధులలో ఊరేగింపు అనంతరం భక్తులకు సర్వ దర్శనం ఉంటుందని దేవస్థాన ప్రతినిధులు శేషాచారి తెలిపారు. తెల్లవారుజామున 2 గంటలకు మూల విరాట్ శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథ స్వామి అభిషేకం, 3 గంటలకు వస్త్రాల అలంకరణ, తొమాల సేవా, తిరుప్పావై సేవాకలము, బాలబోగ నివేదనం, మంగళశాసనం, 5 గంటలకు వైకుంఠ ద్వార దర్శనం, గరుఢ వాహన సేవా, 7 గంటల నుంచి 5 రోజులు రపత్తు ఉత్సవం ప్రారంభం, రాత్రి 12 గంటల వరకు స్వామి వారి దర్శనం అర్చన తీర్థ ప్రసాదాలు కొనసాగుతాయని తెలిపారు.

అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలి



సమావేశంలో ఎమ్మెల్యే మేరాజ్ హుస్సేన్, జోనల్ కమిషనర్ వెంకన్న తదితరులు

చార్మినార్: పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ అధికారులకు సూచించారు. యాకుత్‌పురా నియోజకవర్గానికి సంబంధించిన అభివృద్ధి నిర్మాణ పనుల పురోగతి, పలు సమస్యలపై గురువారం ఆయన జోనల్ కమిషనర్ వెంకన్నతో కలిసి జోనల్ కమిషనర్ కార్యాలయంలో సంబంధిత డివిజన్ల కార్పొరేటర్లు, పలు విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇంజినీరింగ్, ప్రాజెక్ట్స్, రోడ్డు విస్తరణ, నాలా అభివృద్ధి నిర్మాణ పనులు, ఆరోగ్యం, పారిశుధ్యం, టౌన్ ప్లానింగ్, వీధి దీపాలు తదితర విభాగాలకు సంబంధించిన అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..రెయిన్ బజార్, తలబ్ చంచలం, సంతోష్నగర్, కుర్మగూడ డివిజన్లలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. కార్పొరేటర్లు ముజాఫర్ హుస్సేన్, సమీనా బేగం, సయ్యద్ సోహెల్ ఖాద్రీ, మహమ్మద్ వసియుద్దీన్, నస్రీన్ సుల్తానా, జోనల్ ఎస్ఈ మహేశ్వర్ రెడ్డి, సంతోష్ నగర్ సర్కిల్ డీసీ శైలజ పాల్గొన్నారు.

ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌తో విప్లవాత్మక మార్పులు

గోల్కొండ: ఆరోగ్య సంరక్షణలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌తో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయని అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ న్యూ కాజిల్ విజిటింగ్ ప్రొఫెసర్ డాక్టర్ అసది శ్రీనివాసులు అన్నారు. షేక్‌పేట్ జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్ఈ డెటా సైన్స్, ఏఐఅండ్ఎంఎల్ ఆధ్వర్యంలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌తో ఆరోగ్య సంరక్షణ అనే అంశంపై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి డాక్టర్ అసది శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఏదో ఒక విభాగానికి పరిమితం కాదని అన్ని రంగాల విభాగాల్లో ఇది కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ముఖ్యంగా గత కొంత కాలంగా ఆరోగ్య సంరక్షణ విషయంలో కూడా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా ఎన్నో సరికొత్త విషయాలు వెల్లడవుతున్నాయన్నారు. ఇంజినీరింగ్‌కు సంబంధించిన విద్యార్థులు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌పై మక్కువ చూపే విధంగా ప్రాధాన్యత వివరించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.రమేష్‌రెడ్డి, సునీల్ చంగల్వా, డాక్టర్ ఓబులేసు, డాక్టర్ ఎం.సీత, డాక్టర్ ఎస్.కళ్యాణి, డాక్టర్ ఏ.శారధా, డాక్టర్ రామ్‌చరణ్ పాల్గొన్నారు.

బాలికలను క్రీడల్లోనూ ప్రోత్సహించాలి



చాంపియన్‌షిప్ పోటీలను ప్రారంభిస్తున్న విశ్వనాథ్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: బాలికలను విద్యతో పాటు క్రీడల్లోనూ ప్రోత్సహించాలని విశ్రాంత ఐపీఎస్ అధికారి డాక్టర్ విశ్వనాథ్ రవీందర్ సూచించారు. సీఐఎస్‌సీఈ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు సెయింట్ జోసెఫ్ పాఠశాలలో జరుగనున్న 68వ జాతీయ పాఠశాల క్రీడల యోగాసన అండర్-14 బాలికల చాంపియన్‌షిప్ పోటీలను గురువారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బాలికల కోసం ప్రత్యేకంగా క్రీడా పోటీలు నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు యూఏ.సుందరి, అర్జిత్‌బాసు పాల్గొన్నారు.

నిరుద్యోగుల ఉపాధికి ప్రత్యేక కోర్సులు

యాకుత్‌పురా: ఈ ఏడాది ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) కోర్సుతో పాటు మరిన్నీ నూతన కోర్సులను అందుబాటులోకి తీసుకొచ్చి నిరుద్యోగా యువతకు ఉపాధివకాశాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని సెట్విన్ శిక్షణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వేణుగోపాల్ రావు తెలిపారు. పురానీహవేలీలో ఆయన మాట్లాడుతూ..సంస్థ చైర్మన్ గిరిధర్ రెడ్డి సారథ్యంలో శిక్షణ కేంద్రాలను రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ఇందులో భాగంగా ఇటీవల హుస్నాబాద్, నల్గొండ, మహబూబ్‌నగర్ ప్రాంతాల్లో నూతన శిక్షణ కేంద్రాలను ప్రారంభించామన్నారు. త్వరలో జడ్చర్ల, జహీరాబాద్, బోడుప్పల్ ప్రాంతాల్లో కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

క్రీడా పోటీలతో సంబంధాలు బలపడతాయి



అక్బరుద్దీన్ ఒవైసీకి ఆహ్వాన పత్రం అందజేస్తున్న నాయకులు

గోల్కొండ: విద్యార్థుల కోసమే కాకుండా అధ్యాపకుల కోసం కూడా వివిధ రకాల క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమని చాంద్రాయణ గుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ అన్నారు. ఆల్ ఇండియా ఐడియల్ టీచర్స్ అసోసియేషన్ వారు ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్స్, అధ్యాపక బృందానికి నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ ఆహ్వాన పత్రాన్ని గురువారం వారు అక్బరుద్దీన్ ఒవైసీకి అందించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధి సయ్యద్ షహబాజ్ అహ్మద్ ఖాద్రీ మాట్లాడుతూ.. తమ అసోసియేషన్ దేశవ్యాప్తంగా మొత్తం 21 రాష్ట్రాల్లో క్రియాశీలకంగా పని చేస్తుందన్నారు. ప్రతి యేటా తాము పాఠశాలల కరస్పాండెంట్స్, అధ్యాపకులకు టోర్నమెంట్‌లు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే ఈ నెల 11 నుంచి బాలాపూర్ సుల్తాన్ నగర్‌లో నిర్వహించనున్న క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి రావాలని అక్బరుద్దీన్ ఒవైసీని కోరారు. ఈ సందర్భంగా అక్బరుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ.. ఇలాంటి టోర్నమెంట్‌లు నిర్వహించడం వల్ల ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల మధ్య ఉన్న స్నేహ సంబంధాలు బలపడతాయన్నారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

అబిడ్స్: ధూల్‌పేట్ ఆపరేషన్‌లో భాగంగా ఎక్సైజ్ స్పెషల్ టాస్క్ ఫోర్స్ పోలీసులు ధూల్‌పేట్ ఎక్సైజ్ పోలీసులు భారీ ఎత్తున దాడులు నిర్వహించారు. పలు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించి గాంజా రాజేందర్ సింగ్ ఇంట్లో గంజాయి అమ్మకాలు జరుగుతున్నాయనే సమాచారం మేరకు గురువారం ఎస్‌టీఎఫ్ టీమ్ పోలీసులు తనిఖీలు చేపట్టారు. రాజేందర్ సింగ్ ఇంట్లో దాదాపు రెండు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి అమ్మకాలు జరుపుతున్న రాజేందర్ సింగ్, బ్రిజ్ విక్కీ, మెతోరి చెన్నయ్యను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి సెల్‌ఫోన్లు, స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుతో సంబంధం ఉన్న ఆకాష్ సింగ్, దుర్గేష్ సింగ్, వీరేష్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌టీఎఫ్ టీమ్ స్పెషల్ అధికారి అంజిరెడ్డి తెలిపారు. గంజాయిని పట్టుకున్న టీమ్‌లో ధూల్‌పేట్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ సీఐలు మధుబాబు, గోపాల్, ఎస్ఐలు లలిత, సైదులు, హెడ్ కానిస్టేబుళ్లు భాస్కర్‌రెడ్డి, ఆజీమ్, ప్రకాష్, మహేష్, రాకేష్, సతీష్, ఖలీల్ తదితరులు ఉన్నారు.

ఈఎం రేడియేషన్, సైబర్ భద్రతపై అవగాహన



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

అఫ్జల్‌గంజ్: అబిడ్స్ మెథడిస్ట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈఎం రేడియేషన్ సైబర్ భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. మెథడిస్ట్ ఇంజినీరింగ్ కళాశాల, డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్, సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్ సహకారంతో విద్యుదాయస్కాంత రేడియేషన్, సైబర్ భద్రతపై నిర్వహించిన అవగాహన కార్యక్రమం విజయవంతమైంది. ఇంటర్నల్ క్వాలిటీ అష్యూరెన్స్ సెల్, ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం నిర్వహించిన ఈ కార్యక్రమంలో రేడియేషన్, సైబర్ భద్రత ముప్పులతో సంబంధం ఉన్న సంభావ్య ప్రమాదాల గురించి విద్యార్థులు, అధ్యాపకులకు అవగాహన కల్పించడం, ఈఎం రేడియేషన్‌కు గురికావడాన్ని ఎలా తగ్గించుకోవాలో, సైబర్ ముప్పుల నుంచి తమను తాము ఎలా రక్షించుకోవాలో అనే అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ప్రభుజీ బెనకోప్, డైరెక్టర్ లక్ష్మీపతిరావు, ఈసీఈ హెచ్ఓడీ ప్రొఫెసర్ వీఎస్ఎస్ఎన్ శ్రీనివాసబా, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ రవి ఎం.యాదహళ్లి, డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్ డైరెక్టర్ కంప్లెయన్స్ ఎ.శ్రావణ్ కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ పి.శ్యామ్‌రాజు, సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ సీహెచ్ మహిపాల్‌లతో పాటు కళాశాల ఎంబీఏ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

అపర్ణ మల్లాది సేవలు చిరస్మరణీయం

నాంపల్లి: అపర్ణ మల్లాది సంస్మరణ సభ గురువారం నందమూరి తారక రామారావు కళా మందిరంలో జరిగింది. ఈ కార్యక్రమాన్ని తెలుగు విశ్వవిద్యాలయం రంగస్థల కళల శాఖ అధ్యక్షురాలు డాక్టర్ బీహెచ్. పద్మప్రియ అధ్యక్షతన నిర్వహించారు. సినీ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి అనురాధ ఉమర్, సినీ రచయితల సంఘం ఉపాధ్యక్షుడు కేఎల్ ప్రసాద్, రచయితల సంఘం కోశాధికారి నటరాజ మూర్తి, యువ దర్శకుడు జె.వసంత్ హాజరై అపర్ణ మల్లాది చిత్రపటానికి పూలమాలను వేసి నివాళులర్పించారు. సినిమా రంగానికి ఆమె చేసిన సేవలు చిరస్మరణీయం వక్తలు పేర్కొన్నారు.

పోలీసు సేవలపై క్యూఆర్ కోడ్ ఏర్పాటు



యాకుత్‌పురా: రాష్ట్రంలో పోలీసులు అందిస్తున్న సేవలపై ప్రజల అభిప్రాయం కోసం ప్రభుత్వం రూపొందించిన క్యూఆర్ కోడ్ స్టిక్కర్‌ను గురువారం మీర్‌చౌక్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ నయీముద్దీన్ స్టేషన్‌లో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం పోలీసు సేవలపై ప్రజాభిప్రాయ సేకరణ కోసం క్యూఆర్ కోడ్‌ను ప్రవేశపెట్టిందన్నారు. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే ఫిర్యాదులు, ఎఫ్ఐఆర్ ఈ-చలాన్, పాస్ పోర్టు ధ్రువీకరణ, ఇతర అంశాలు వస్తాయన్నారు.